సాక్షి తిరుపతి

సోమవారం । 28 । ఆగస్టు । 2023



ఉద్యాన పంటకు ఉపాధి ఊతం

ఉపాధి హామీ పథకం కింద ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సాయం ఉద్యాన పంటలకు ఊతం అందిస్తోంది. - 8లో



ఘాట్‌లో బోల్తా పడిన లారీ

రాపూరు– చిట్వేల్ మార్గంలో లారీ బ్రేకులు ఫెయిల్ అవడంతో లోయలో పడి ఒకరు మృతి చెందారు. - 8లో

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	37	26
చిత్తూరు	37	26
తిరుమల	32	22
గూడూరు	38	28
నగరి	37	27

న్యూస్‌రీల్

18న శ్రీనివాస సేతు ప్రారంభం!



వంతెనను పరిశీలిస్తున్న అభినయ్ రెడ్డి

తిరుపతి తుడా: శ్రీనివాస సేతు ఫ్లై ఓవర్‌ను సెప్టెంబర్ 18న సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్నట్టు డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి తెలిపారు. ఆదివారం రాత్రి కమిషనర్ హరిత, ఇంజినీర్లతో కలిసి ఆయన నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు రూ.650 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న శ్రీనివాస పనులు పూర్తికావొచ్చాయన్నారు. పెండింగ్ పనులన్నీ 15 రోజుల్లోపు పూర్తి కావాలని ఆదేశించారు.

శ్రీకాళహస్తిలో దుకాణాల తనిఖీ



పరిశీలిస్తున్న ఈవో సాగర్‌బాబు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయం నాలుగో గేటు సమీపంలో ఉన్న దుకాణాలను ఈవో సాగర్‌బాబు ఆదివారం తనిఖీ చేశారు. దుకాణాలు ఉన్న ప్రాంతంలోనే వ్యాపారాలు చేసుకోవాలన్నారు. ముందుకు చొచ్చుకు రాకూడదని సూచించారు. అదే విధంగా భక్తులు భద్రపరిచే సెల్‌ఫోన్ కౌంటర్లను తనిఖీ చేశారు. సిబ్బందిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 14 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. క్యూ కాంప్లెక్స్‌లో 29 కంపార్ట్‌మెంట్లు నిండాయి. శనివారం అర్ధరాత్రి వరకు 73,073 మంది స్వామివారిని దర్శించుకోగా 32,215 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. హుండీలో రూ.3.67 కోట్లు కానుకలను భక్తులు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తుల కు సకాలంలోనే దర్శనమవుతుండగా.. దర్శన టికెట్లు లేని భక్తులకు 14 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

నేడు కలెక్టరేట్‌లో స్పందన

తిరుపతి అర్బన్: కలెక్టరేట్‌లో సోమవారం స్పందన కార్యక్రమం యథావిధిగా ఉంటుందని కలెక్టర్ వెంకటరమణారెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30గంటల వరకు నిర్వహించే స్పందనలో ప్రజలు తమ సమస్యలను తెలియజేయా లని కోరారు. అన్ని విభాగాలకు చెందిన జిల్లా అధికారులు స్పందనకు హాజరుకావాల్సి ఉందని తెలిపారు. కార్యాలయంలోనే ఉంటూ సబార్డినేటర్లను పంపితే కుదరదని స్పష్టం చేశారు.

డిగ్రీ ఫలితాలు విడుదల

తిరుపతి సిటీ : శ్రీ వేంకటేశ్వర విశ్వ విద్యాలయం పరిధిలో ఈ ఏడాది జూన్‌లో నిర్వహించిన డిగ్రీ (బీఏ, బీకాం, బీఎస్సీ, బీసీఏ, ఒకేషనల్) కోర్సులకు సంబంధించి 6వ సెమిస్టర్ పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు ఎస్వీయూ పరీక్షల నియంత్రణ అధికారి దామ్లానాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు మనబడి వెబ్‌సైట్‌లో ఫలితాలను పరిశీలించుకోవచ్చని ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

జిల్లా స్థాయి సివిల్ సర్వీసెస్ క్రీడా పోటీలు

తిరుపతి ఎడ్యుకేషన్ : సివిల్ సర్వీసెస్ ఉద్యోగులకు ఈ నెల 29, 30వ తేదీల్లో జిల్లా స్థాయి క్రీడా పోటీలను నిర్వహించనున్నట్లు శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఏటీ, జిల్లా చీఫ్ కోచ్ సయ్యద్‌సాహెబ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా 29వ తేదీ మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 5గంటల వరకు శ్రీనివాస స్పోర్ట్స్ క్లబ్ ఆవరణలో చెస్, బ్యాడ్మింటన్, టెన్నిస్, టేబుల్ టెన్నిస్, క్యారమ్స్, స్విమ్మింగ్, యోగా, రెజ్లింగ్, బెస్ట్ ఫిజిక్ (బాడీ బిల్డింగ్) పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. 30వ తేదీ ఉదయం 8గంటల నుంచి ఎస్వీ ఆర్ట్స్ కళాశాల క్రీడా మైదానంలో హాకీ, ఫుట్‌బాల్, మధ్యాహ్నం 3నుంచి 5గంటల వరకు ఎస్వీ యూనివర్సిటీ స్టేడియంలో ఖోఖో, కబడ్డీ, బాస్కెట్‌బాల్, వాలీబాల్, అథ్లెటిక్స్, క్రికెట్, వెయిట్ లిఫ్టింగ్‌లలో పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న సివిల్ సర్వీస్ ఉద్యోగులు ఈ పోటీల్లో పాల్గొనవచ్చని, పూర్తి వివరాలకు 95420 34270, 91777 96469ను సంప్రదించాలని ఆయన కోరారు.

నాడు

టీడీపీ పాలనలో ఉన్నత విద్య చదివే విద్యార్థులను మోసం చేసి ఇబ్బందులు పెట్టారు. విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేసి యువత భవిష్యత్తును అగమ్యగోచరంగా మార్చేశారు. చంద్రబాబు పాలనలో ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని ఏనాడూ పట్టించుకోలేదు. ఇంజినీరింగ్, డిగ్రీ, ఇతర ఉన్నత కోర్సులు చదివే విద్యార్థులకు సకాలంలో నిధులు విడుదల చేయక పోవడంతో కళాశాల యాజమాన్యాలు ఇబ్బందులు పెట్టేవి. ఫీజు రీయింబర్స్‌మెంట్ ఉంటుందన్న ఆశతో ఉన్నత కోర్సుల్లో చేరిన విద్యార్థులు ఎన్నో ఇక్కట్లు ఎదుర్కొన్నారు. విద్యార్థులు కాళ్లు అరిగేలా కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన దుస్థితి. ఫీజులు చెల్లించలేక తల్లిదండ్రులు అప్పుల పాలయ్యారు.

నేడు

పాదయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం అధికారంలోకి వచ్చిన వెంటనే జగనన్న విద్యాదీవెన, జగనన్న వసతి దీవెన పథకాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించారు. పేదరికం నుంచి బయటపడాలంటే విద్యతోనే సాధ్యమవుతుందని భావించిన ముఖ్యమంత్రి ప్రతి ఏటా ఇచ్చిన మాట ప్రకారం జగనన్న విద్యా దీవెన పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను మంజూరు చేస్తున్నారు. ఇంజినీరింగ్, మెడిసిన్, పాలిటెక్నిక్, ఐటీఐ, డిగ్రీ తదితర కోర్సులు చదివే పేద విద్యార్థులు కాలేజీలకు చెల్లించాల్సిన పూర్తి ఫీజుల మొత్తాన్ని ప్రభుత్వం తల్లుల ఖాతాల్లో నేరుగా జమ చేస్తున్నారు. అర్హులైన విద్యార్థులకు ఏటా నాలుగు విడతలుగా పూర్తి ఫీజురీయింబర్స్‌మెంట్ అందజేస్తున్నారు.



సీఎం సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రులు, అధికారులు

నేడు జగనన్న విద్యాదీవెన

పేద విద్యార్థులను ఉన్నత చదువులు చదివించాలనే సమున్నత లక్ష్యంతో జగనన్న విద్యాదీవెన పథకాన్ని క్రమం తప్పకుండా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారు. ఈ పథకంలో పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను ఏటా క్రమం తప్పకుండా ప్రభుత్వం అందిస్తోంది. ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, ఇంజినీరింగ్, మెడిసిన్ తదితర కోర్సులు చదివే విద్యార్థులకు విద్యాదీవెన భరోసా కల్పిస్తోంది. ఈ పథకం అమలుతో ఇంటర్‌తోనే ఫుల్‌స్టాప్ పెట్టే పరిస్థితి నుంచి పేద, మధ్యతరగతి విద్యార్థులు ఉన్నత చదువుల వైపు అడుగులు వేస్తున్నారు.

- 35,312 మంది తల్లుల ఖాతాల్లోకి జమ కానున్న రూ.29,23,21,988
- 38,960 మంది విద్యార్థులకు లబ్ధి
- నేడు సీఎం ప్రారంభోత్సవం



నగరిలో ముస్తాబవుతున్న సీఎం సభా వేదిక

చిత్తూరు కలెక్టరేట్/తిరుపతి అర్బన్ : జగనన్న విద్యాదీవెన పథకం (ఫీజురీయింబర్స్‌మెంట్)తో వేలాది మంది విద్యార్థుల కుటుంబాల్లో వైఎస్సార్ సీపీ సర్కారు విద్యాసుగంధాలు నింపుతోంది. పేద విద్యార్థులకు చదువు కోసం అయ్యే ఖర్చును ప్రభుత్వం భరిస్తోంది. ఉన్నత విద్య అభ్యసించే వారికి ఆర్థికసాయం చేస్తూ అండగా నిలుస్తోంది. ఏటా జగనన్న విద్యాదీవెన కింద డబ్బులు బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తోంది. చంద్రబాబు పాలనలో ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకుండా విద్యార్థులను ఇబ్బందులు పెట్టారు. కళాశాలల యాజమాన్యాలకు మేలు కలిగేలా 30శాతం ఫీజులను పెంచి విద్యార్థుల తల్లిదండ్రులు అప్పుల పాలయ్యేలా చేశారు. ఎన్నికలకు ముందు ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు పెంచుతామంటూ మభ్యపెట్టేందుకు ప్రయత్నించారు. తరగతులను మానుకుని అలా కార్యాలయాల చుట్టూ తిరిగినప్పటికీ వారి ఇబ్బందులను ఏ మాత్రం పట్టించుకోని దుస్థితి ఉండేది. ప్రస్తుతం ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రతి త్రైమాసికంలో విద్యార్థుల తల్లుల ఖాతాల్లో ప్రభుత్వం నగదు జమచేస్తోంది. ఈ పథకం అమలుతో జిల్లా వ్యాప్తంగా ఇంటర్ పాసై ఉన్నత చదువులకు వెళ్లే విద్యార్థుల శాతం పెరిగిందని అధికారులు వెల్లడిస్తున్నారు.

నగరిలో ప్రారంభం

2023–24 సంవత్సరానికి సంబంధించి జగనన్న విద్యాదీవెన పథకం కింద సోమవారం తల్లుల ఖాతాల్లో ప్రభుత్వం నగదు జమ చేయనుంది. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ కార్యక్రమాన్ని నగరి నుంచి సోమవారం ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా తిరుపతి కలెక్టరేట్ నుంచి లబ్ధిదారులు కార్యక్రమాన్ని వీక్షించడానికి అవసరమైన ఏర్పాట్లు చేపట్టారు. ఈ పథకం ద్వారా 35,312 మంది తల్లుల ఖాతాల్లోకి రూ.29,23,21,988 నగదు జమ కానుంది. దీంతో 38,960 మంది విద్యార్థులకు లబ్ధి చేకూరనుంది.

నియోజకవర్గాల వారీగా లబ్ధిదారులు	
చంద్రగిరి	6904
గూడూరు	5363
నగరి	2133
సత్యవేడు	5069
శ్రీకాళహస్తి	5949
సూళ్లూరుపేట	5314
తిరుపతి	5168
వెంకటగిరి	3060

కులాలవారీగా లబ్ధిదారులు	
ఎస్సీ	11,371
ఎస్టీ	1,238
బీసీ	17,197
ఈబీసీ	4,512
ముస్లిం మైనారిటీ	1,701
కాపు	2,821
క్రిస్టియన్ మైనారిటీ	120

బహుముఖ ప్రజ్ఞాశాలి భూమన్



భూమన్ దంపతులకు పూలాభిషేకం చేస్తున్న భూమన కరుణాకరరెడ్డి



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ఈవో ధర్మారెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం, మేయర్ శిరీష, జాతీయ మీడియా సలహాదారు దేవులపల్లి అమర్

- మూడు తరాల మనిషిపై వెల్లువెత్తిన ప్రశంసలు
- భూమన్ ఆదర్శప్రాయుడు
- టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి కల్చరల్: ఆచార వ్యవహారాలపై లోతైన అవగాహన, పరిశీలనాత్మమైన దృష్టి, సుదీర్ఘ విశ్లేషణ కలిగిన విషయ పరిజ్ఞాని, వేలాదిమంది యువకులను చైతన్యం చేసిన భూమన్ బహుముఖ ప్రజ్ఞాశాలి అని పలువురు వక్తలు ప్రశంసల జల్లు కురిపించారు. మానవ వికాస వేదిక ఆధ్వర్యంలో మూడు తరాల మనిషి భూమన్ పుస్తకావిష్కరణ సభ ఆదివారం ఎస్‌ఆర్ కన్వెన్షన్‌హాల్లో అత్యంత ఆత్మీయతతో సాగింది. దీనికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన మానవ వికాస వేదిక గౌరవ అధ్యక్షుడు, టీటీడీ చైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి ప్రసంగించారు. సామాన్య ప్రజల కోసం భూమన్ తిరుపతి వేదికగా అనేక ఉద్యమాలను నిర్వహించిన గొప్ప వ్యక్తి అని తెలిపారు. తిరుపతిలో ఉద్యమాలు మొదలెట్టి రాష్ట్ర మంతా అల్లుకుపోయారని, 55 ఏళ్ల క్రితమే రాష్ట్ర రాజకీయాల్లో పెను సంచలనానికి మారుపేరుగా నిలిచారని కొనియాడారు. తమ జీవన గమనాన్ని మార్చిన వారిలో త్రిపురనేని, భూమన్ ముందు వరుసలో ఉంటారన్నారు. టీటీడీ ఈవో ఏవీ.ధర్మారెడ్డి మాట్లాడుతూ తాను విద్యార్థి దశలో ఉన్నప్పుడే భూమన్ చేపట్టిన ఉద్యమాలు తన మదిలో ఇంకా మెదులుతూనే ఉన్నాయన్నారు. ప్రపంచ వ్యాప్తంగా అన్ని పుస్తకాలను సమాజానికి అందుబాటులో ఉంచాలన్న సంకల్పంతో శ్వేత డైరెక్టర్‌గా డిజిటల్ లైబ్రరీగా మార్చడం భూమన్ ముందు చూపునకు నిదర్శనమన్నారు. అమరరాజా సంస్థల అధినేత గల్లా రామచంద్ర నాయుడు మాట్లాడుతూ భూమన్ పుస్తకాల పురుగు అని పేర్కొన్నారు. భూమన సోదర ద్వయం చిన్న తనం నుంచే సమాజ హితం కోరుకునే స్వభావాన్ని అలవర్చుకున్నారని తెలిపారు. జాతీయ మీడియా సలహాదారుడు దేవులపల్లి అమర్ మాట్లాడుతూ భూమన సోదరులు ఎంతో ముందు చూపు కలిగిన గొప్ప వ్యక్తులని ప్రశంసించారు. సీనియర్ జర్నలిస్ట్ తాడి ప్రకాష్ మాట్లాడుతూ సమాజ హితం కోసం పని చేసే వ్యక్తిగా భూమన్ అందరికీ మార్గదర్శిగా నిలిచారని కొనియాడారు. మూడు తరాల మనిషి పుస్తక రచయిత, సన్మాన గ్రహీత భూమన్ మాట్లాడుతూ సామాజిక ఎదుగుదల కోసం తాను, తన తమ్ముడు భూమన కరుణాకరరెడ్డి పని చేస్తున్నట్లు చెప్పారు. తమ కుటుంబ వారసుడుగా అభినయ్ డెప్యూటీ మేయర్ హోదాలో ప్రజల ప్రశంసలు అందుకునేలా తిరుపతి అభివృద్ధి చేస్తున్నారని ఇది తమకు ఎంతో సంతోషాన్ని కలిగిస్తోందన్నారు. అయితే తిరుమల వన్యప్రాణుల అంశంపై జరుగుతున్న ప్రచారాన్ని ఆక్షేపించారు. మన తిరుపతిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరికీ ఉందని, ఈ ఊరిని అపప్రదం చేయవద్దని భూమన్ విజ్ఞప్తి చేశారు. మూడు తరాల మనిషి భూమన్ దంపతులను ఆత్మీయులు, అభిమానులు, శిష్యబృందాలు, ప్రముఖులు ఆత్మీయత భావనతో జ్ఞాపికలతో, పుష్ప గుచ్ఛాలతో ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం, మేయర్ డాక్టర్ శిరీష, డెప్యూటీ మేయర్ భూమన అభినయరెడ్డి, మానవ వికాస వేదిక ప్రతినిధులు సాకం నాగరాజు, శైలకుమార్ పాల్గొన్నారు.

వైభవంగా కల్యాణ వెంకన్న పవిత్రోత్సవాలు



ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం నిర్వహిస్తున్న అర్చకులు

తిరుపతి రూరల్: తుమ్మలగుంట కల్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయంలో పవిత్రోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం ఉదయం స్వామి వారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి తోమాల సేవ, కొలువు, పంచాంగ శ్రవణం, సహస్ర నామార్చన నిర్వహించారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత స్వామి వారి ఉత్సవర్లను కల్యాణ మండపంలోకి వేంచేపు చేశారు. అక్కడ స్నపన తిరుమంజనం చేశారు. అనంతరం స్వామి, అమ్మవార్లు ఆలయ మాడ వీధుల్లో ఊరేగారు. ఆలయ యాగశాలలో సాయంత్రం వైదిక కార్యక్రమాలు నిర్వహించి పవిత్రాల ప్రతిష్ఠ చేశారు. ఏడాది పాటు ఆలయంలో స్వామి వారికి జరిగే నిత్య, వార, పక్ష, మాస, వార్షిక ఉత్సవాల్లో తెలియక జరిగే తప్పిదాలకు ప్రాయశ్చిత్తం కోరుతూ ఆలయంలో మూలమూర్తి నుంచి పరివార దేవతలు, ధ్వజస్తంభంకు పవిత్రాలను సమర్పించడం ఆనవాయితీ. ఈ వేడుకల్లో ఆలయ ఈఓ నల్లందుల సుబ్బరామిరెడ్డి, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

చల్లబడిన కొండ



ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రంలో శనివారం రాత్రి కురిసిన వర్షానికి తిరుమల కొండ చల్లబడింది. వర్షం కారణంగా అర్ధరాత్రి నుంచి తిరుమల శ్రీవారి ఆలయం నిర్మానుష్యంగా మారింది. రామ్‌భగీచా వద్ద వర్షపు నీరు డివైడర్ ఎత్తుకు చేరుకుంది. తిరుమల లోతట్టు ప్రాంతాల్లో పెద్ద ఎత్తున వర్షపు నీరు నిలిచింది. కొండను తెల్లని పొగమంచు కప్పేసింది. ప్రకృతి అందాలను చూసి భక్తులు పులకించారు. - తిరుమల

పవిత్రోత్సవాలు ఆరంభం



తిరుమల శ్రీవారి ఆలయంలో పవిత్రోత్సవాలు ఆదివారం ఆగమోక్తంగా ఆరంభమయ్యాయి. మొదటి రోజు పవిత్ర ప్రతిష్ట నిర్వహించారు. ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత మలయప్ప స్వామి యాగశాలకు వేంచేపు చేయగా.. అక్కడ హోమాలు, వైదిక కార్యక్రమాలు చేపట్టారు. సంపంగి ప్రాకారంలో వేడుకగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం స్వామి,అమ్మవార్లు ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులను కనువిందు చేశారు. - తిరుమల

పల్లె సంప్రదాయమే జానపదం

- జానపదాలను కాపాడుకుందాం
- గీతాలాపనలో వక్తల పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు పోకల అశోక్‌కుమార్

తిరుపతి కల్చరల్: పల్లె సంప్రదాయాల నుంచి పుట్టినవే జానపదాలు అని, ఇలాంటి జానపద కళలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని వక్తలు పిలుపునిచ్చారు. ప్రపంచ జానపద మాసోత్సవంలో భాగంగా మన సంస్కృతి కళా సంస్థ ఆధ్వర్యంలో మహతి కళాక్షేత్రంలో ఆదివారం జానపద గీతాలాపన కార్యక్రమాన్ని చేపట్టారు. దీనికి ముఖ్య అతిథులుగా చిత్తూరు బౌద్ధ దమ్మ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కట్టమంచి బాలకృష్ణారెడ్డి, టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు పోకల అశోక్‌కుమార్, కుప్పం రెడ్డెమ్మ సాహితీ పురస్కారాల సంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు డాక్టర్ కె.రామలక్ష్మి హాజరై ప్రసంగించారు. మాట నుంచి పాట ఉద్భవిస్తే పాటకు సంగీతం జతకలిసి కళగా రూపాంతరం చెందిందన్నారు. మన ముందు తరాల్లో శ్రామైక జీవనం, కష్టజీవులే ఎక్కువ మంది అని, రోజంతా కాయకష్టం చేసి ఇళ్లకు చేరిన వారి అలసట తీర్చి వారికి స్వాంతన చేకూర్చే కళా రూపాలే జానపదాలు అని తెలిపారు. జానపదాలకు పల్లెలే పుట్టినిల్లు అని, పల్లె పడుచులు లయబద్ధంగా పాడుకునే పాటలు శ్రావ్యంగా ఉంటాయన్నారు. బుర్రకథలు, ఒగ్గుకథలు, హరికథలు, వీధి నాటకాలు తోలు బొమ్మలాటలు, చెక్క భజనలు, పండిరి భజనలు, గొబ్బి పాటలు, కోటాలాలు వంటి జానపదాలు ఆనాటి పల్లె ప్రజల జీవన విధానం ఆచారాల నుంచి ఉద్భవించాయని తెలిపారు. ఇలాంటి జానపద కళలను, కళాకారులను నిరంతర కార్యక్రమాలతో ఆదరిస్తున్న మన సంస్కృతి కళా సంస్థ నిర్వాహకులు అభినందనీయులని కొనియాడారు. అనంతరం వివిధ జిల్లాల నుంచి విచ్చేసిన గాయనీ గాయకులు అద్భుత రీతిలో జానపద గీతాలను ఆలపించి సభికులను రంజింపజేశారు. ఈ కార్యక్రమంలో మన సంస్కృతి కళా సంస్థ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి కె.రెడ్డెప్ప, గౌరవాధ్యక్షుడు జానం గంగిరెడ్డి, ప్రముఖ రచయిత్రి ఎంఆర్.అరుణకుమారి, చింతగుంపల ఆనందనాయుడు, మునిరత్నం, ఎస్.వరప్రసాద్, వెంకట శేషయ్య, కళాకారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

31న లక్ష తులసీ దళార్చన



రాపూరు : జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో స్వయంభువుగా వెలసిన శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో గురువారం లక్ష తులసీ దళార్చన, లక్ష కుంకుమార్చనపూజ నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ జనార్దన్‌రెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ శ్రావణ పౌర్ణమి సందర్భంగా శ్రీవారి క్రేన్ మండపంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను కొలువుదీర్చి స్వామివారికి అత్యంత ప్రీతికరమైన తులసీ దళాలతో శతసహస్ర తులసీ దళార్చన, ఆదిలక్ష్మీ అమ్మవారికి శతసహస్ర కుంకుమార్చన నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఘాట్‌లో బోల్తాపడిన లారీ: ఒకరు మృతి


లోయలో పడిన లారీ (ఇన్‌సెట్) మృతి చెందిన శ్రీను

రాపూరు: రాపూరు -చిట్వేల్ మార్గంలోని ఘాట్‌రోడ్డులో ఆదివారం తెల్లవారుజామున ధాన్యంలోడుతో వస్తున్న లారీ అదుపుతప్పి లోయలో పడడంతో ఒకరు మృతి చెందగా మరొకరు గాయాలతో బయటపడ్డారు. ఏఎస్‌ఐ వెంకటేశ్వరావు కథనం , వైఎస్సార్ జిల్లా రాజంపేట నుంచి నెల్లూరుకు 25 టన్నుల ధాన్యం లోడుతో 12 చక్రాల లారీ బయలు దేరింది. ఆదివారం వేకువజామున 2 గంటలకు రాపూరుకు 10వ కిలోమీటర్ మలుపు వద్ద బ్రేక్ ఫెయిల్ కావడంతో లారీ అదుపు తప్పి లోయలో పడిపోయింది. లారీని నడుపుతున్న శ్రీను (32) లారీలో చిక్కుకుని మృతి చెండగా, లారీలో ఉన్న ఎర్రిస్వామి స్వల్ప గాయలతో బయటపడ్డారు. ఎర్రిస్వామి రాపూరు పోలీసులకు సమాచారం అందించడంతో సీఐ సుబ్రమణ్యం, ఇన్‌చార్జి ఎస్‌ఐ అనూషా, పోలీసు సంఘటన స్థలానికి చేరుకుని లారీ క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన శీను మృతదేహాన్ని బయటకు తీసీ రాపూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతదేహనికి సోమవారం పోస్టు మార్టం నిర్వహించనున్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఉద్యాన పంటలకు ఉపాధి ఊతం


ఉపాధి పథకం కింద సాగు చేసిన మామిడి తోట


ఏపుగా పెరిగిన నిమ్మ మొక్కలు

- పండ్ల తోటల సాగుపై రైతుల ఆసక్తి
- మూడేళ్ల పాటు రక్షణ చర్యలు
- జిల్లాలో 1,300 ఎకరాల్లో సాగు

చిల్లకూరు : సన్న, చిన్న కారు రైతులు మెట్టభూముల్లో పండ్ల తోటల సాగుకు శ్రీకారం చుడుతున్నారు. దీనికి తగ్గట్టుగానే ప్రభుత్వం ఉద్యానవన పంటలకు ఉపాధిను అనుసంధానం చేయడంతో రైతులకు సగం భారం తగ్గిపోయింది. దీంతో జిల్లాలోని రైతులు మామాడి, నిమ్మ, దానిమ్మ, జామ, నేరేడు, మునగ, కొబ్బరి లాంటి పంటలు సాగు చేసేందుకు ఎక్కువగా మొగ్గు చూపుతున్నారు. కొంత ఇసుక నేలలు ఉన్న వారు గులాబీ, మల్లి లాంటి పూల రకాలను సాగు చేసేందుకు సిద్ధమవుతున్నారు ఇలాంటి వారికి ఉపాధి హామీ పథకం ఊతం ఇస్తోంది. గుంతలు తవ్వన మొక్కలు నాటి అవి మూడేళ్లు వచ్చే వరకు సంరక్షించే బాధ్యతను కూడా ఉపాధి పథకం కిందనే చేపడుతున్నారు. దీంతో రైతు చీడ పీడల నుంచి పంటను కాపాడుకుని సత్తువ చేసుకుంటూ ఉంటే సకాలంలో కాపుకు వచ్చి దిగుబడిని సాధించవచ్చు. ఇందులో ప్రధానంగా అతి తక్కువ కాలంలో వచ్చే పోషకాలు ఉండే పంటగా ఉన్న మునగ సాగును రైతులు చేపడుతున్నారు. అయితే మార్కెటింగ్ సదుపాయముంటే ఇంకా ఎక్కువగా రైతులు ముందుకు వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా 1300 ఎకరాల్లో ఉద్యాన పంటలు సాగులోకొచ్చాయి.

ధ్రువపత్రం తీసేకొస్తేనే...

సన్నా, చిన్న కారు రైతులుగా ఉన్న వారు రెవెన్యూ కార్యాలయం నుంచి ధ్రువపత్రం తీసుకొస్తే వారికి సుమారు మూడు నుంచి ఐదు ఎకరాల వరకు భూములుండాలి. నేల స్వభావాన్ని బట్టి మొక్కలు పెంచుకునేలా ఉద్యాన శాఖాధికారులు సూచనలు ఇస్తున్నారు. వీటిలో మామిడి, సపోట, చీనీ, జామ, సీతాఫలం, కొబ్బరి, చింత, నిమ్మ, నేరేడు, మామిడి, నేరేడు, జామ, మునగ, తైవాన్ జామ, ఆపిల్ బేర్, బత్తాయి, జీడిమామిడి, బత్తాయి లాంటి రకాలు సాగు చేసుకోవచ్చు. వీటిలో కొన్ని పంటలకు రెండేళ్లు, మరి కొన్నింటికి మూడేళ్ల వరకు ఉపాధి ద్వారా నిధులు మంజూరవుతుంటాయి. వీటితో మొక్కలను ఏపుగా పెంచుకుని ఫల సాయం పొందవచ్చు.

మునగ కాపుకు వచ్చింది

రెండేళ్ల క్రితం మునగ సాగుకు రైతులు దరఖాస్తు చేసుకోగా ఉపాధి పథకం కింద మంజూరు చేశారు. నేడు మునగ బాగా ఏపుగా పెరిగి కాపుకు వచ్చింది. రెండేళ్ల నుంచే కాపుకు వస్తుండడంతో మిగతా రైతులు కూడా ఆసక్తిని చూపిస్తున్నారు. రెండు నెలల పాటు కాయలు కోతకు వస్తుండడం, ఏడాది పొడవునా మునగాకు విక్రయించుకుని ఆదాయం పొందే అవకాశం ఉండడంతో సాగుకు రైతులు ముందుకు వస్తున్నారు.

20 ఏళ్ల వరకు ఆదాయం



మెట్ట భూమి మూడు ఎకరాలు ఉండడంతో ఉపాధి హామీ పథకం కింద మామిడి సాగుకు దరఖాస్తు చేసుకున్నా. ఎకరాకు 70 మొక్కలు అందించారు. మూడేళ్లకుగాను రూ.1,03,193 అందించారు. దీంతో నేడు మొక్కలు బాగా ఎదుగుతున్నాయి. వచ్చే ఏడాది కాపుకు వచ్చే అవకాశం ఉంది. 20 ఏళ్ల వరకు ఏటా ఆదాయం వస్తుంది.

– కందల ప్రకాష్‌రావు, కలవకొండ, చిల్లకూరు మండలం

నిమ్మ సాగు బాగుంటుంది



నాకు 1.79 ఎకరాల భూమి ఉండగా అది గలస నేల. నిమ్మ సాగు చేస్తే బాగుంటుందని ఉద్యాన శాఖాధికారులు సలహా ఇచ్చారు. దీంతో ఉపాధి హామీ పథకంలో దరఖాస్తు చేసుకున్నా. ఎకరాకు 110 చొప్పున నిమ్మ మొక్కలు ఇచ్చారు. ఆ మొక్కల సంరక్షణకు రూ.1,41,515 ఇచ్చారు. మొక్కలు ఇప్పుడు కాయలు కాస్తున్నాయి.

– ఎం సీతారామమ్మ, ఓడూరు, చిల్లకూరు మండలం

మొక్కలు అందించేందుకు సిద్ధం



సన్న, చిన్న కారు రైతులకు ఉపాధి హామీ పథకం కింద 17 రకాల పండ్ల తోటల పెంపకానికి మొక్కలు అందించేందుకు సిద్ధంగా ఉన్నాం. అయితే భూమి స్వభావాన్ని బట్టి సాగు చేపట్టాల్సి ఉంది. దీనికి స్థానికంగా ఉండే అధికారుల సలహాలు తీసుకోవాలి. ఏ పంట సాగు చేయాలో తెలుసుకుని దరఖాస్తు చేస్తే మంజూరు చేస్తాం.

– శ్రీనివాసప్రసాద్, డ్వామా పీడీ, తిరుపతి



బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.60,540
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,438
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.75,800
రిటైల్ వెండి గ్రాము	రూ.77.80

హోరాహోరీగా క్రికెట్ పోటీలు

వెంకటగిరి రూరల్: ఆంధ్రక్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక తారకరామ క్రీడా ప్రాంగణంలో జరుగుతున్న సౌత్‌జోన్ అండర్–16 క్రికెట్ పోటీల్లో భాగంగా ఆదివారం కడప– అనంతపురం, చిత్తూరు– కర్నూలు జట్ల మధ్య క్రికెట్ పోటీలు హోరాహోరీగా సాగాయి. గ్రౌండ్–1లో బ్యాటింగ్ దిగిన కడప జట్టు 103.4 ఓవర్లకు 90 పరుగులు చేసింది. అనంతపురం జట్టు 189 పరుగులతో ముందంజలో ఉంది.

గ్రౌండ్–2లో...

చిత్తూరు– కర్నూలు జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఫస్ట్ ఇన్నింగ్స్‌లో చిత్తూరు జట్టు 82.2 ఓవర్లకు 244 పరుగులు తీసి ఆలౌట్ అయింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కర్నూలు జట్టు సెకండ్ ఇన్నింగ్స్‌లో 41.1 ఓవర్లకు 121 పరుగులు తీసి 5 వికెట్లు కోల్పోయింది. నెల్లూరు జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో లీడ్‌లో ఉంది. కర్నూలు జట్టు 72 పరుగులు ఆధిక్యంలో ఉంది.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి


హసీం(ఫైల్)

వరదయ్యపాళెం: విద్యుత్ షాక్‌కు గురై వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని ముస్లింపాళెంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం మేరకు ముస్లింపాళెంకు చెందిన ఊత్తుకోట హసీం (47) ఆదివారం ఇంటి పునర్నిర్మాణ పనులు చేపట్టారు. అందులో భాగంగా టైల్స్ వేస్తుండగా అటువైపుగా అమర్చిన విద్యుత్ వైరు తగలడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే సొమ్మసిల్లి పడిపోయాడు. చికిత్స నిమిత్తం వరదయ్యపాళెంకు తరలిస్తుండగా, మార్గమధ్యంలోనే మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతునికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

జోరుగా టీసీఎల్ క్రికెట్ పోటీలు


తలపడుతున్న చిల్లకూరు, వాకాడు జట్లు

గూడూరురూరల్ : పట్టణంలోని అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో ప్రగతి సేవాసంస్థ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి టీచర్స్ క్రికెట్ లీగ్ టోర్నమెంట్ (టీసీఎల్)–2023 హోరాహోరీగా సాగుతోంది. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా సెప్టెంబర్ 5 ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 25, 26, 27 తేదీల్లో ఈ క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ క్రమంలో భాగంగా మూడో రోజు ఆదివారం ఉత్కంఠభరితంగా సాగిన పోటీల్లో డీవీ సత్రం జట్టుపై చిల్లకూరు జట్టు, దక్కిలి జట్టుపై రాపూరు జట్టు, కోట జట్టుపై బాలాయపల్లి జట్టు, పెళ్లకూరు జట్టుపై నెల్లూరు కార్పొరేషన్ జట్టు గెలుపొందాయి. దీంతో రాపూరు, బాలాయపల్లి, నెల్లూరు కార్పొరేషన్ జట్లు సెమీ ఫైనల్స్‌కు చేరాయి. ప్రగతి సేవా సంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్, టోర్నమెంట్ డైరెక్టర్ పి.కరిముల్లాఖాన్ మాట్లాడుతూ సోమవారం సెమీ ఫైనల్స్, ఫైనల్ మ్యాచ్‌లను నిర్వహించి అనంతరం విజేతలకు బహుమతులను అందజేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో నిర్వహణ కమిటీ సభ్యులు మురళీసింగ్, బాబర్, సతీష్, ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

కీచక ఉపాధ్యాయుడు సస్పెన్షన్


అంకిరెడ్డి

వరదయ్యపాళెం: మండల కేంద్రంలోని హైస్కూల్‌లో విధులు నిర్వహిస్తున్న కీచక ఉపాధ్యాయుడు సస్పెన్షన్‌కు గురయ్యాడు. 8వ తరగతి చదువుతున్న బాలిక పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన సైన్స్ ఉపాధ్యాయుడి తీరును తల్లిదండ్రులకు సవివరంగా వివరించింది. దీంతో ఆగ్రహించిన తల్లిదండ్రులు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, జిల్లా కలెక్టర్, డీఈఓలకు ఫిర్యాదు చేశారు. స్పందించిన జిల్లా యంత్రాంగం బాలిక పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడు అంకిరెడ్డిని సస్పెండ్ చేస్తూ డీఈఓ శేఖర్ ఆదేశాలు జారీ చేశారు.

22ఏ రద్దుతో వేల కుటుంబాల్లో వెలుగులు


సీఎం వైఎస్ జగన్, టీటీడీ చైర్మన్ చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న పార్టీ నాయకులు, ప్రజలు

తిరుపతి మంగళం : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి 22ఏ జీవోను రద్దు చేసి వేలాది కుటుంబాల్లో వెలుగులు నింపారని 34, 44 డివిజన్ల కార్పొరేటర్లు వరికుంట్ల నారాయణ, శ్రావణి మునిరామిరెడ్డి కొనియాడారు. గత టీడీపీ ప్రభుత్వం 22ఏ జీవోను తీసుకొచ్చి నగరంలోని అనేక ప్రాంతాల్లోని భూములు, నివాస ప్రాంతాలకు రిజిస్ట్రేషన్లు జరగకుండా చేసిందని గుర్తుచేశారు. దీంతో ఇల్లు, స్థలాలను విక్రయించుకోలేక ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ సమస్యలను తిరుపతి ఎమ్మెల్యే, టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి 22ఏ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన సీఎం 22ఏను రద్దు చేసినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం 34, 44 డివిజన్లలో టౌన్‌బ్యాంక్ డైరెక్టర్ పోలిరెడ్డి నాగిరెడ్డి, వార్డు అధ్యక్షులు మునిరామిరెడ్డి, అశోక్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో కార్పొరేటర్లు, పార్టీ నాయకులు, స్థానికులు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో తెలుగు భాషోద్యమ సమితి సభ్యురాలు మస్తానమ్మ, పార్టీ నాయకులు నాధముని, రాఘవులునాయుడు, ధనంజయ్, ముస్తఫా, గిరి ప్రభాకర్, లక్ష్మి, మంజుల, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా వీరభద్రుని కల్యాణం


వీరభద్రుని కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

నారాయణవనం: స్థానిక టీటీడీ అనుబంధ ఆలయమైన భద్రకాళీ సమేత వీరభద్ర ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి శాస్త్రోక్తంగా ఆర్జిత కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. ఉదయం ఆలయాన్ని తెరచిన అర్చకులు నిత్యపూజా కై ంకర్యాలను పూర్తి చేశారు. 10 గంటలకు భద్రకాళీ, వీరభద్రస్వాములకు స్నపన తిరుమంజనం నిర్వహించి, ధూప, దీప నైవేద్యాలను సమర్పించారు. సాయంత్రం స్వామి వారికి రథోత్సవాన్ని నిర్వహించారు. రథం లేకపోవడంతో సర్వభూపాల వాహనాన్ని ఉత్సవర్లను సుందరంగా అలంకరించి గ్రామ వీధుల్లో ఊరేగించారు. సాయంత్రం 7.30 గంటలకు ఆలయ ప్రాంగణంలో వీరభద్రునికి ఆర్జిత కల్యాణాన్ని నిర్వహించారు. కల్యాణోత్సవంలో పాల్గొన్న దంపతులకు తీర్థ ప్రసాదాలను, వస్త్రబహుమానాన్ని అందజేశారు. స్థానిక టీటీడీ ఆలయాల ఏఈవో పార్థసారథి, సూపరింటెండెంట్ ఏకాంబరం, ఆలయ అధికారి నాగరాజు, భద్రతా జమేదార్ రాజశేఖర్ పర్యవేక్షించారు. ఉత్సవాల్లో సోమవారం సాయంత్రం వసంతోత్సవాన్ని, రాత్రి అశ్వ వాహన సేవను నిర్వహిస్తున్నట్లు నాగరాజు తెలిపారు.

వైభవంగా అగ్నిగుండం


అగ్నిగుండం ప్రవేశం చేస్తున్న భక్తులు

ఏర్పేడు: మండలంలోని పాపానాయుడుపేటలో ద్రౌపదీ ధర్మరాజుల స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి అగ్నిగుండం వైభవంగా నిర్వహించారు. ఉదయాన్నే స్వామి అమ్మవార్లకు పలు రకాల అభిషేకాలతో విశేషాలంకరణ చేసి పూజలు నిర్వహించారు. అగ్నిగుండం ప్రవేశం చేసే భక్తులు కంకణాలు కట్టుకున్నారు. కంకణాలు ధరించిన భక్తులు ఆదివారం రాత్రి 9 బావుల్లో స్నానాలు చేసి పసుపు దుస్తులు ధరించి గోవిందనామ స్మరణతో వరుస క్రమంలో నిలబడ్డారు. పోతురాజు, ద్రౌపదీదేవి ఉత్సవ మూర్తులను అగ్నిగుండం వద్దకు ఊరేగింపుగా తీసుకుని వెళ్లారు. ఆలయ పూజారి ముందుగా అగ్నిగుండం నుంచి నిప్పును తీసి అమ్మవారి పైట చెరగులో వేశారు. పూలబంతిని అగ్నిగుండంలో వేసి భక్తులు గోవిందనామ స్మరణతో అగ్నిగుండ ప్రవేశం చేశారు. మహిళలు భక్తిశ్రద్ధలతో ఆలయం వద్ద పొంగళ్లు నిర్వహించారు.

ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం, వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్‌రెడ్డి పూజలు చేశారు. ఏర్పేడు సీఐ శ్రీహరి ఆధ్వర్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ లలిత, ఎంపీటీసీ మునిరాజా, జెడ్పీటీసీ తిరుమలయ్య, ఎంపీపీ గీత, వైస్ ఎంపీపీలు జనార్ధన్‌రెడ్డి, శ్రీనివాసులు, మాజీ సర్పంచ్‌లు తంబా సుబ్రమణ్యం, గోవిందస్వామి పాల్గొన్నారు.